

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 22 నవంబరు 2025





- ఎన్‌హెచ్ఏఐ నుంచి గుంటూరు కలెక్టరేట్‌కు ఫైనల్ డీపీఆర్
- బహిర్గతం కావడంతో రైతుల ఆగ్రహం
- 140 మీటర్ల భూసేకరణ, ఇతరత్రా ఖర్చులకే రూ. 3,117 కోట్లు..
- 250 మీటర్లంటే రూ.5 వేల కోట్లకు పైగానే నిధుల అవసరం

అంత.. వేడల్పా..!?

250 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్..

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని అవుటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్) తుది డీపీఆర్(సవివర ప్రాజెక్టు నివేదిక) జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ నుంచి కలెక్టరేట్‌లకు చేరుకుంది. దాదాపుగా 190 కిలోమీటర్ల వ్యాసార్థంతో గుంటూరు, పల్నాడు, ఎన్‌టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాలో నిర్మించనున్న ఈ రాజధాని మణిహారం వెడల్పుని పెంచుకొంటూ పోతున్నారు. తొలుత 100 మీటర్ల వెడల్పుతో భూసేకరణ ప్రతిపాదించారు. ఆ తర్వాత భవిష్యత్తు అవసరాల పేరుతో 140 మీటర్ల వెడల్పునకు కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించింది. ఇప్పుడు 250 మీటర్లు(పావు కిలోమీటర్) వెడల్పుతో తుది డీపీఆర్‌ని ఎన్‌హెచ్ఏఐ ఆమోదం తీసుకొని ఐదు జిల్లాల కలెక్టరేట్‌లకు పంపించింది. డీపీఆర్‌లో పొందుపరిచిన ఎలైన్‌మెంట్ ప్రకారం సెంటర్ లైన్ నుంచి ఇరువైపులా 125 మీటర్ల భూసేకరణ

(మిగతా 8లో)

భూ సేకరణకు రెవెన్యూ సిద్ధం

గుంటూరు జిల్లాలోని 40 గ్రామాల్లో 4792.83 ఎకరాలను సేకరణకు ప్రతిపాదనలు రూపుదిద్దుకొంటున్నాయి. అలానే పల్నాడు జిల్లాలో 1,181 ఎకరాలను సేకరించబోతున్నారు. ఇదే విధంగా కృష్ణ, ఏలూరు, ఎన్‌టీఆర్ జిల్లాల్లో మరో 5 వేల ఎకరాలకు పైగానే సేకరించాల్సి ఉంటుంది. భూసేకరణకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్లు వెలువడిన తర్వాత అనేకమంది కోర్టు మెట్లు ఎక్కాలని భావిస్తున్నారు. అవి తేలేసరికి ఎన్ని సంవత్సరాల సమయం పడుతుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో 140 మీటర్ల వెడల్పునకే పరిమితమై భూసేకరణ చేపడితే ప్రాజెక్టు ఖర్చు తగ్గడంతో పాటు రైతుల అభ్యంతరాలు కూడా తగ్గుతాయి. అలానే నీటివనరులకు నష్టం జరగదు. గ్రామాల్లో నివాసాలు, పరిశ్రమలు తొలగించాల్సిన పరిస్థితి ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



గాయత్రినగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, వాసిరెడ్డి లింగమూర్తి



గాయత్రి నగర్‌లో నిర్మించిన రహదారిని చూపిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

అక్షరం అండగా.. సమస్యలు పరిష్కారం

- ప్రజలు అడిగారు.. పాలకులు స్పందించారు
- రెండు నెలల్లో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం
- వినుకొండలో రూ.63.60 లక్షలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- స్థానికుల హర్షాతిరేకాల మధ్య ప్రారంభించిన చీఫ్‌విప్ జీవీ
- ప్రజలకు, పాలకులకు మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి కృషికి ప్రశంసలు

- రెండేళ్లలో ఇంటింటికి తాగునీరు అందించడమే జీవితాశయం : చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంతో వినుకొండలో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయి. రోడ్లు లేక.. డ్రెయినేజి వ్యవస్థ లేక ఆయా ప్రాంతవాసులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోగా గతంలో పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. వర్షాల సమయంలో అయితే వారు ఇళ్ల నుంచి బయటకు కూడా అడుగు పెట్టలేక అల్లాడిపోతుండేవారు. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి వినూత్నంగా చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం ద్వారా గాయత్రినగర్, కొట్నాల్ప వీధి ప్రాంతవాసులు తమ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నాడు వారు ఆయా ప్రాంతాల్లో పర్యటించగా ప్రజలు స్వయంగా తమ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆంధ్రజ్యోతి వేదికగా కోరారు. మహిళలు ఎక్కడికక్కడ సమస్యలకు సంబంధించిన అర్జీలను జీవీకి అందజేసి తమ బాధలను వినిపించారు. మహిళలు తెలియజేసిన సమస్యలపై స్పందించిన జీవీ వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టారు. ప్రజలు కోరిన ఆయా పనులు పూర్తి కావడంతో శుక్రవారం వేడుకగా ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మట్టి రోడ్లతో, డ్రెయిన్లు లేక పడిన అవస్థలు తీరడంతో

(మిగతా 8లో)



పనులు ఇలా..

- కొట్నాల్పవీధిలో రూ18.60 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు
- గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్లు

ఎన్ఎస్‌పీ కాలనీకి వరాలు..

ఎన్ఎస్‌పీ కాలనీలో చిల్డ్రన్స్ పార్కు నిర్మాణం, గుర్రం జాషువ పేరుతో లైబ్రరీ, ఇండోర్ స్టేడియం, షాదీఖానా, టీటీడీ కల్యాణ మండపం, హోల్‌సెల్ కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు.



స్థానికులు, అర్జీలతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



యూరియా బస్తా.. రూ.500

బ్లాక్‌తో కొండెక్కిన ధర

- రైతులను పిండేస్తున్న వ్యాపారులు
- ఖరీఫ్ పరిస్థితులు రబీలోనూ పునరావృతం
- కేటాయింపులు.. అమ్మకాలు అంతటా అక్రమమే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎరువులు పుష్కలంగా ఉన్నాయి.. ఎక్కడా కొరత లేదు. అవసరం మేరకు ఎంత కావాలంటే అంత సరఫరా చేస్తున్నాం. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. అదనపు ధర కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.. ఎవరైనా అలా వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి ఆ వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.. అని అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇందుకు పూర్తి విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి. రెండు రెట్ల ధరకు యూరియా విక్రయిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ధర గురించి ప్రశ్నిస్తే యూరియా లేదనే సమాధానంతో రైతులు నిరాశ చెందుతున్నారు. అత్యంత తక్కువ ధరకు లభ్య మవ్వాల్సిన యూరియాను బ్లాక్ చేసిన వ్యాపారులు ధరను అమాంతం పెంచేశారు. వాస్తవానికి యూరియా బస్తా రూ.266.50. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో బస్తా రూ.500 చెల్లిస్తే తప్ప దొరకడంలేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా అంతటా ఇదే పరిస్థితి. కృత్రిమ కొరత సృష్టించి రైతుల నుంచి ఎక్కువ మొత్తం లో వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎరువులు కేటాయింపులు.. అమ్మకాలు అన్నింట్లో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. రబీలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో యూరియా వాడకం ఎక్కువగా ఉంటుంది. కాగా ఖరీఫ్‌లో ఏ పరిస్థితి సృష్టించారో అదే పరిస్థితి రబీలోనూ సృష్టించేందుకు కొందరు కంకణం కట్టుకున్నట్లు స్పష్టమవుతుంది. రెండో పంట కింద సాగు చేసే మొక్క జొన్నలో అధిక దిగుబడి కోసం ఎకరాకు 12 నుంచి 16 బస్తాల యూరియా

(మిగతా 8లో)

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



చిన్నారులతో మాట్లాడుతున్న రాయపాటి శైలజ

8

కళ్లకు కట్టిన మందపోరు

- వేడుకగా పల్నాటి వీరారాధన ఉత్సవాలు
- కులమతాలకు అతీతంగా చాపకూడు
- సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు

8



సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు, ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, అరవిందబాబు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధాన్యం సేకరణపై జేసీ సూరజ్ ధనుంజయ్ సమీక్ష

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, నవం బరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ శుక్రవారం ప్రారంభించింది. ప్రాధాన్యం ఇస్తేనే మద్దతు.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో పౌరసరఫరాల శాఖ మీనమేషాలు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జేసీ సూరజ్ ధనుంజయ్ స్పందించారు. ధాన్యం సేకరణపై ఆయన అధికారులతో సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లపై డిస్ట్రిక్ట్ ప్రొక్యూర్మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. 286 రైతు సేవా కేంద్రాలను 100 క్లస్టర్లుగా విభజించి ధాన్యం కొనుగోళ్లకు సిబ్బంది నియమించినట్లు జేసీ తెలిపారు. నకరికల్లు, పిడుగురాళ్ల, రాజుపాలెం, ఈపూరు మండలాల్లో నూర్పిళ్లు జరుగుతున్నందున తొలిగా కొనుగోలు కేంద్రాలను ఆయా మండలాల్లో ఏర్పాటు చేసినట్లు జేసీ తెలిపారు. రానున్న వారం రోజుల్లో మిగిలిన మండలాల్లో కూడా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. మద్దతు ధరకన్నా తక్కువకు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు. జిల్లాకు ప్రాథమికంగా ప్రభుత్వం 40 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా ఇచ్చినట్లు చెప్పారు. అవసరమైతే ఆ లక్ష్యం పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ నారదముని, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ సహకార భవన్

డీసీసీబీ అక్రమార్కులపై వేటు

- ఇద్దరు మాజీ సీఈవోల సస్పెన్షన్
- లాల్‌పురం రాము సహా పాలకవర్గంపై క్రిమినల్ చర్యలు

నల్లపాడు బ్రాంచ్‌లో రూ.22.25 కోట్ల కుంభకోణం జరిగినట్లు నిర్ధారణ

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అక్రమార్కులపై వేటు పడింది. నల్లపాడు బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై ఇద్దరు మాజీ సీఈవోలు కృష్ణవేణి, అజయ్‌కిశోర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ పాలకవర్గం శుక్రవారం తీర్మానించింది. వైసీపీ హయాంలో జీడీసీసీబీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. ప్రధానంగా నల్లపాడు బ్రాంచ్‌లో ప్లెడ్జి రుణాల మంజూరు, డ్వాక్రా గ్రూపుల పేరుతో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. ప్లెడ్జి రుణాల పేరుతో రూ.13.15 కోట్లు, మెప్మా పరిధిలో రూ.6.05 కోట్లు, డీఆర్‌డీఏ స్వయం సహాయ సంఘాలకు రూ.1.41 కోట్లు, జగనన్న మహిళా ధీమా కింద రూ.1.2 కోట్లు, దీర్ఘకాలిక రుణాలుగా రూ.37 లక్షలు మంజూరు.. ఇలా రూ.22.25 కోట్లు అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలింది. ఈ అక్రమాలకు బాధ్యులుగా అప్పటి పాలకవర్గం రాతంశెట్టి సీతారామాంజనేయు(లాల్‌పురం రాము)లుతో పాటు పాలకవర్గ సభ్యులుగా తేల్చారు. ఈ క్రమంలో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రస్తుత చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. అలానే ప్లెడ్జి రుణాలకు సంబంధించి 191 మంది, మెప్మా పరిధిలో 212 మంది, డీఆర్‌డీఏ పరిధిలో 60 మంది, జగనన్న మహిళా ధీమా కింద వ్యక్తిగత రుణాలు పొందిన 320 మంది, నిబంధనలకు విరుద్ధంగా దీర్ఘకాలిక రుణాలు పొందిన మరో 13 మంది ఇలా మొత్తం 796 మందిపై సివిల్ చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. 186 మందిపై క్రిమినల్, 27 మందిపై క్రమశిక్షణా చర్యలు, బ్యాంకు సిబ్బంది 10 మంది, డీఆర్‌డీఏలో ఆరుగురు, మెప్మా సిబ్బంది 11 మందిపై కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సస్పెన్షన్ చేస్తూ తీర్మానం

విచారణ నివేదిక నేపథ్యంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన అధ్యక్షతన శుక్రవారం బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో జరిగిన సమావేశంలో ఇద్దరు మాజీ సీఈవోలపై వేటు వేస్తూ తీర్మానం చేశారు. మొత్తానికి బ్యాంకులోని తాజా పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి.

నలుగురు దొంగల అరెస్టు

- రూ 80 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

రూ.60 లక్షల నకిలీ సిగరెట్ల పట్టివేత

పండ్ల తోటలను సందర్శించిన కేంద్ర బృందం

బాలికపై అత్యాచార యత్నం.. 20 ఏళ్ల జైలు

6



భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి

- కృష్ణానదిలో పుణ్యస్నానాలు.. దీపారాధనలు

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం పోలి పాడ్యమిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తిక మాసం ముగిసి అమావాస్య మరుసటి రోజున పోలి పాడ్యమి రోజున భక్తులు పూజలు నిర్వహిస్తారు. కార్తిక మాసం నెలరోజులు దీపాలు వెలిగించలేని వారు ఈ ఒక్కరోజు ఉదయం 4 నుంచి 6 గంటల వరకు కార్తిక దీపాలను వెలిగించి నదిలో వదిలితే కార్తిక మాస పుణ్యంతో పాటు ముక్తి కూడా లభిస్తుందని భక్తుల నమ్మకం. అందులో భాగంగా గురువారం రాత్రికి భక్తులు అమరేశ్వరాలయం చేరుకుని రాత్రి నిద్రచేసి తెల్లవారుజాము నుంచి కృష్ణానదిలో స్నానమాచరించారు. అనంతరం దీపాలను వెలిగించి అరటి దొప్పలపై దీపాలను నదిలో వదిలారు. వేలాది మంది భక్తులు వెలిగించిన దీపాలతో నదీ తీరం వెలుగులు విరజిమ్మింది. నదిలో అలలపై వదిలిన దీపాలు ఎంతదూరం వెళ్లిందో గమనిస్తూ మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం క్యూలో వేచిఉండి అమరేశ్వరుడి దర్శనం చేసుకున్నారు.



167ఏ జాతీయ రహదారిపై రావిపాడు వద్ద ఏర్పడిన గుంతలు

రోడ్లు.. గోతులమయం

- వర్షాలతో అధ్వానంగా మారిన వైనం
- రూ.29.55 కోట్ల పనులకు చెల్లింపులు నై

నరసరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై గుంత కనపడకూడదు. రోడ్లపై గోతులతో వాహనదారులు ఇబ్బందులు పడకూడదు. గత వైసీపీ హయాంలోని పరిస్థితి ఎక్కడా కనిపించకూడదు.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడా కానరావడంలేదు. గతంలో ఉన్నంతగా గోతులు లేకపోయినా పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రభుత్వం ఒక మారు గోతులను పూడ్చివేయగా తుఫాన్, భారీ వర్షాలతో ఎక్కడికక్కడ రోడ్లు అధ్వానంగా మారాయి. తూతూ మంత్రంగా చేపట్టిన పనులు కూడా వర్షాలతో బహిర్గతమయ్యాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారులతో పాటు పంచాయతీ, మున్సిపల్ పట్టణాల్లో రోడ్లు గోతులతో నిండి.. వాహన చోదకులకు నరకం చూపుతున్నాయి. అయినా గోతులను పూడ్చివేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. జనవరికి ముందు రెండు విడతల్లో రూ.29.55 కోట్లతో పనులు చేశారు. అయితే నేటి వరకు ఆయా పనులకు సంబంధించి బిల్లుల్లో రూపాయి కూడా విడుదల చేయలేదు.

రూ.18.40 కోట్ల పనులకు ఆమోదం

నరసరావుపేట బైపాస్, సత్తెనపల్లి, గురజాల, పెదకూరపాడు, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ క్రమంలో రూ.18.40 కోట్ల వ్యయంతో ఐదు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొండ్రముట్ల-బండమోడు - దుర్గి, నకరికల్లు - గురజాల రహదారి, మాచర్ల - వీపీ సౌత్, గుంటూరు - అమరావతి రహదారి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. అయితే ఆయా పనులకు టెండర్లు దాఖలు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గత బకాయిలు విడుదల చేస్తేనే టెండర్లు దాఖలయ్యే పరిస్థితులు నెలకున్నాయి.



ప్రమాదకరంగా మారిన వినుకొండ-కారంపూడి రహదారి (ఫైల్‌ఫోటో)

జగన్ బలప్రదర్శన తప్పుడు సంకేతం

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాల ఎదుట నేరస్తుల బల ప్రదర్శన న్యాయవ్యవస్థపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నియంతృత్వ పోకడలు, రాజ్యాంగ విరుద్ధ చర్యలపై న్యాయస్థానాలు కఠినంగా వ్యవహరించాలని కోరారు. అడ్డగోలుగా ఆర్థిక నేరాలకు పాల్పడి, ఇప్పటికే 16 నెలల జైలు జీవితం గడిపిన జగన్‌మోహన్‌రెడ్డి.. తాజాగా సీబీఐ కోర్టుకు హాజరయ్యే క్రమంలో హంగామా సృష్టించడం ప్రజాస్వామ్య నిబంధనలకు పూర్తి విరుద్ధమన్నారు. న్యాయమూర్తుల ఎదుట బలప్రదర్శనలు.. కోర్టుకు గైర్హాజరు అవ్వాలన్న జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు ప్రణాళికలో భాగమేనన్నారు.

రూ.60 లక్షల నకిలీ సిగరెట్ల పట్టివేత



కంటైనర్ తనిఖీ చేస్తున్న సీఐలు

రేపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమతుల్లేని నకిలీ సిగరెట్ల కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి పెనుమూడి జాతీయ రహదారి వద్ద తనిఖీలు నిర్వహించగా.. ఓ కంటైనర్‌లో నకిలీ సిగరెట్లను గుర్తించామని తెలిపారు. పోలీస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రెవెన్యూ అధికారుల సమక్షంలో తనిఖీ చేయగా.. సుమారు రూ.60లక్షలు నకిలీ సిగరెట్లకు.. జీఎస్టీ, బిల్లులు లేవని తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

'సీనియర్స్'లో తెలంగాణ ఎడ్ల సత్తా



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మానందరెడ్డి, ఆంజనేయులు

కారంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా స్థానిక నూతన బస్టాండ్ సమీపంలో శుక్రవారం సీనియర్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి ఎడ్ల జత 2,330 అడుగులతో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 2,250 అడుగులతో ద్వితీయ స్థానంలోని నిలిచింది. కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన పొందుగుల ఈశ్వర్ ఎడ్లజత తృతీయ స్థానం, నంద్యాల జిల్లా గోస్పాడుకు చెందిన గోటికే హెత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్లజత నాలుగో స్థానం, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పాలువూరి వీరస్వామి చౌదరి ఎడ్ల జత ఐదోస్థానం, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగ శివశంకర్ ఎడ్లజత ఆరోస్థానం, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లజత ఏడోస్థానం దక్కించుకున్నాయి. విజేత ఎడ్ల యజమానులకు సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ సోదరి నాగలక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. సొసైటీ చైర్మన్ రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, గ్రామ పెద్ద బొమ్మిన శ్రీనివాసరావు, చింతపల్లి రామ్మూర్తి, పలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌లపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో.. శుక్రవారం చిరు ధాన్యాల ప్రాసెసింగ్ ద్వారా మహిళా సాధికారితపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల ఆర్థిక సాధికారితకు.. ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ వివరించారు. ఆరోగ్యం సంరక్షణలో చిరుధాన్యాలకు డిమాండ్ ఉందన్నారు. గ్రామీణ మహిళలు చిన్న యంత్రాలు ఉపయోగించి ప్రాసెసింగ్ యూనిట్‌ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను వివరించారు. సెర్ప్ సంస్థ ప్రతినిధి పార్థసారథి మాట్లాడుతూ ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఎంఎస్ఎంఈ వంటి పథకాల కింద ప్రాసెసింగ్ యూనిట్‌లకు రుణాలు, రాయితీలు లభిస్తాయన్నారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగించుకుని.. సులభంగా వ్యాపారం ప్రారంభించవచ్చన్నారు. ప్రాసెసింగ్ నిపుణులు డాక్టర్ విష్ణువర్ధన్, జి.రవిబాబు, డాక్టర్ బి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ కె.వి.ఎస్.రామిరెడ్డి, డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్, డాక్టర్ కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి పటిష్ట కార్యాచరణ

కృష్ణానదిలో చేప పిల్లలు విడుదల చేసిన కలెక్టర్ అన్సారియా



చేపపిల్లలను విడుదల చేస్తున్న కలెక్టర్ అన్సారియా, సబ్ కలెక్టర్ సంజన

తాడేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ అమలు చేస్తోందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం ప్రకాశం బ్యారేజి జలాశయంలో.. ఉండవల్లి పడవల రేవులో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహతో కలిసి చేప పిల్లలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్‌లో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక మత్స్య రంగాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. బ్యారేజి జలాశయంలో 23.50 లక్షల చేప పిల్లలను విడుదల చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ప్రకాశం బ్యారేజి జలాశయంతోపాటు నాలుగు మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, జిల్లాలోని 202 గ్రామాల మంచి నీటి చెరువుల్లోనూ మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యం కోసం ఫిష్ వెండింగ్ యూనిట్లను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆరు మత్స్యకార సంఘాలకు నూరు శాతం రాయితీతో మంజూరు చేసిన రూ.10,11,978 చెక్కును అందజేశారు. గుంటూరు చేపల మార్కెట్‌లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కిరణ్, మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు భూశంకర్, ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి, ఎంపీపీ కృష్ణ, ఎంపీటీసీ శివకుమారి, తహసీల్దార్ సీతారామయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రావు, మత్స్యకారులు పాల్గొన్నారు.

హామీలు.. వంద శాతం పూర్తి చేస్తాం

● మంత్రి పొంగూరు నారాయణ

తుళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇచ్చిన హామీలన్నీ వంద శాతం పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. రైతులతో ఎవరు అవహేళనగా మాట్లాడలేదని, రైతులకు ఏ సమస్య వచ్చినా రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయంలో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. శుక్రవారం రాజధాని గ్రామాలైన వెంకటపాలెం, ఉద్దండరాయుని పాలెంలో నిర్మాణం జరుగుతున్న 15 అంగన్‌వాడీ, 14 పీహెచ్‌సీ, 14 పాఠశాలలు, ఒక మల్టీ పర్పస్ శ్మశాన వాటిక నిర్మాణాలను మంత్రి పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి మాట్లాడుతూ, గ్రామ కంఠాలు, జరీబు, లంక భూముల సమస్యలపై ప్రతిరోజూ అధికారులతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. లంక భూములకు ఎన్జీటీ అనుమతులు ఇవ్వడం లేదని, ఒకరిద్దరు రైతులు తమకు కోరుకున్న చోటా ప్లాట్స్ కావాలని డిమాండ్ చేస్తున్నారని, నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కడ రిటర్నబుల్ ప్లాట్స్ ఇచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. రాజధాని రైతులకు ఇచ్చిన ప్లాట్‌లలో మౌలిక సదుపాయల కల్పన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రాజధానిలో మొత్తం 29,421 మంది రైతులకు 61,433 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని తెలిపారు. కేవలం 2,270 మంది రైతులకు 7,988 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, ప్రతిరోజు 30 నుంచి 40 రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయని వివరించారు. గత 21 రోజుల్లో 231 మందికి 443 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని తెలిపారు. కోర్టు కేసులు, కుటుంబ తగాదాలు కారణంగా కొన్ని ప్లాట్ల కేటాయింపు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఒకరిద్దరు రైతులు అనవసరంగా సోషల్ మీడియాలో రకరకాల పోస్టులు పెడుతున్నారని, రైతులు ఎవరికీ అన్యాయం జరగదన్నారు. మూడేళ్లలో రాజధాని పూర్తి చేసి తీరుతామని మరోసారి మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

విజ్ఞాన్ వర్సిటీని సందర్శించిన అమెరికా బృందం



అమెరికా వర్సిటీ బృందంతో చైర్మన్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు (విద్య) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయాన్ని యూఎస్ఏ ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ (బీజీఎస్‌యూ) ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించినట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ తెలిపారు. బీజీఎస్‌యూ ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నే కె.రోజర్స్, అడ్వకేట్ డాక్టర్ సాండ్రా బి.ఎర్లే, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి క్రోవి, అకడమిక్ అఫైర్స్ వైస్ ప్రొవోస్ట్ డాక్టర్ రోడ్నే కె. రోజర్స్, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ డీన్ డాక్టర్ వేల్ మోక్తర్ తదితరులకు వర్సిటీ తరపున ఆత్మీయ స్వాగతం పలికారు.కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ విజ్ఞాన్, బీజీఎస్‌యూ మధ్య ఉన్న అవగాహన ఒప్పందం కేవలం విద్యార్థి మార్పిడికి మాత్రమే కాకుండా అంతర్జాతీయ విద్యా పరిశోధన సహకారానికి కూడా అని తెలిపారు. రెండు యూనివర్సిటీల అధ్యాపకులు ఒకరికొకరు వర్సిటీల్లో తాత్కాలికంగా బోధించే అవకాశం ఉంటుందన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీరావు, డీన్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే నరేంద్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పొన్నూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. చింతలపూడిలోని ఎమ్మెల్యే స్వగృహంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జాబ్ మేళా ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 13న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో.. 50 ప్రముఖ సంస్థల ప్రతినిధులు వెయ్యికి పైగా ఉద్యోగాల భర్తీకి రానున్నట్లు చెప్పారు. డిగ్రీ నుంచి అన్ని విద్యార్హతలున్న అభ్యర్థులు.. హాజరు కావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ, కోశాధికారి పులిపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు లలిత శాస్త్రి, మాచిరాజు మురళీకృష్ణ, సుబ్రహ్మణ్య శర్మ, ఆముదాలపల్లి రామకృష్ణ, శేష తల్పసాయి, దేశరాజు బాలగంగాధర్ తిలక్, మాజేటి నాగరాజు, తాడేపల్లి వెంకటర్నం, రేటూరు చక్రధర్ రావు, పులిజాల సాంబశివరావు, మునిపల్లె మురళి పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



లారీని అడ్డుకుంటున్న గ్రామస్తులు

యడ్లపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకాయలపాడు రెవెన్యూ పరిధిలో జరుగుతున్న మట్టి తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. శివారు ఉప్పరపాలెం గ్రామస్తులు శుక్రవారం సాయంత్రం గ్రామ పరిధిలోని గురుకుల పాఠశాల వద్దకు చేరుకుని అక్రమ తవ్వకాలను నిలుపుదల చేశారు. గ్రావెల్ తరలిస్తున్న లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాల సమీపంలోని ప్రభుత్వ భూముల్లో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మట్టి తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దీనితో తామే తవ్వకాలను అడ్డుకున్నట్లు తెలిపారు.

బాలికపై అత్యాచార యత్నం.. 20 ఏళ్ల జైలు

తెనాలి క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలికపై అత్యాచార యత్నం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. తెనాలి వైకుంఠపురంలోని పూరి గుడిసెల్లో నివాసం ఉండే ఒక కుటుంబానికి చెందిన ఆరు, ఏడేళ్ల వయస్సున్న అక్కా చెల్లెళ్లు 2021 జనవరి 1న మధ్యాహ్నం సమీపంలోని కట్ట వద్ద బహిర్భూమికి వెళ్లారు. ఇది గమనించిన అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ బిళ్లా డేవిడ్‌రాజ్ (32) వారిని అనుసరించాడు. వెనుక నుంచి వచ్చి ఆరేళ్ల బాలికపై అఘాయిత్యానికి యత్నించాడు.. బాలిక అరవడంతో సమీప ప్రాంతాల వారు వచ్చి బాలికను రక్షించారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేయగా, అప్పటి డీఎస్పీ స్రవంతిరాయ్ కేసు దర్యాప్తు చేశారు. నరసరావుపేట దిశా ఉమెన్స్ స్టేషన్ అప్పటి డీఎస్పీ యు.రవిచంద్ర చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్షణ, రూ.10 వేలు అపరాధ రుసుం విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం బాధిత బాలిక కుటుంబానికి రూ.4 లక్షలు నష్టపరిహారం.. 30 రోజుల్లో అందించాలని ఆదేశాలిచ్చారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలినేని రాఘవయ్య ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

డ్రాఫ్టింగ్ అండ్ ప్లీడింగ్స్ సర్టిఫికెట్ కోర్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ, రెక్టార్ తదితరులు

ఏఎన్‌యూ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో డ్రాఫ్టింగ్ అండ్ ప్లీడింగ్స్ సర్టిఫికెట్ కోర్సు బ్రోచర్‌ను వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ ఆర్.శివరాంప్రసాద్ శుక్రవారం సంయుక్తంగా ఆవిష్కరించారు. న్యాయ విద్యార్థులకు సరికొత్త కోర్సుల ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు ఇలాంటివి దోహదపడతాయని వీసీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. న్యాయ విభాగపు అధిపతి ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి ఈ కోర్సు నాన్ జ్యుడీషియల్ సిబ్బందికి, న్యాయవాద గుమస్తాలకు, టైపిస్టులకు, న్యాయ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. డిసెంబరు 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కోర్సు కొనసాగుతుందన్నారు. కోర్సు ఫీజును రూ.10,000గా నిర్ణయించినట్లు తెలిపారు. వర్సిటీ సిబ్బంది, విద్యార్థులకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని, వర్సిటీ వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచినట్లు చెప్పారు. డిసెంబరు 15వ తేదీ వరకు గడువు ఇచ్చారని, అనంతరం అపరాధ రుసంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. న్యాయవిభాగపు అధ్యాపకులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ శివరాం, అభిలాష్ గోపీనాథన్ పాల్గొన్నారు.

అవాస్తవ ప్రచారంపై కఠిన చర్యలు

వాస్తవాలను వక్రీకరిస్తూ రాస్తున్న ఒక ఆన్‌లైన్ పేపర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని పీజీ కో-ఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు పేర్కొన్నారు. ప్రశ్నపత్రం లీకేజీ ఎక్కడ జరిగిందో చెప్పాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎం.కామ్ పరీక్ష థర్డ్ సెమిస్టర్ 3, 4 పేపర్లో ఒక ప్రశ్న రెండు సార్లు రిపీట్ అయ్యిందని.. ఇన్విజిలేటర్ విషయం తెలియజేయగా వెంటనే సెకండ్ సెట్ పేపర్ ఇచ్చామన్నారు. తనపై తప్పుడు అభియోగాలు తీసుకొస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు.

పండ్ల తోటలను సందర్శించిన కేంద్ర బృందం



గుట్లపల్లిలో భవన నిర్మాణాన్ని పరిశీలించిన బృంద సభ్యులు

వినుకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అందుగుల కొత్తపాలెంలో ఎంఐడీహెచ్ పథకంలో భాగంగా పండిస్తున్న పండ్లు, పూలు, కూరగాయల తోటలను కేంద్ర బృందం శుక్రవారం సందర్శించింది. పండ్ల తోటల పెంపకం ద్వారా ఆదాయ వనరుల గురించి బృందం సభ్యులు రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ అందుతుందా లేదా అని అడిగారు. అనంతరం బొల్లాపల్లి మండలం గుట్లపల్లి గ్రామంలో నిర్మిస్తున్న కూరగాయలు, సుగంధ ద్రవ్యాల భవన నిర్మాణాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి. ఐ. వెంకట్రావు, కేంద్ర బృందం సభ్యులు కె. మనోజ్, అండర్ సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్, రాజీవ్ కుమార్, హేమంగా భార్గవ్, ఏవీఎస్వి. జమదగ్ని, వినుకొండ, గురజాల ఉద్యాన అధికారులు ఎస్కే. నబి రసూల్, వై.మోహన్ పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 584.60 అడుగులు ఉంది. ఇది 296.28 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,019, ఎడమ కాలువ ద్వారా 3,259, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,130, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 47,508 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

నలుగురు దొంగల అరెస్టు

రూ.80 లక్షల చోరీ సొత్తు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బి.కృష్ణారావు

నరసరావుపేట లీగల్, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం, రూరల్, వినుకొండ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పలు చోరీలకు పాల్పడిన నలుగురు దొంగలను గురువారం పట్టణంలోని అంధ పాఠశాల వద్ద అరెస్టు చేసినట్లు ఎస్పీ కృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని బరంపేటకు చెందిన పేరేచర్ల వంశి, పెద్ద చెరువుకు చెందిన వేముల తిరుపతిరావు, రామిరెడ్డిపేటకు చెందిన మీసాల రాజేష్, మాచర్లకు చెందిన బండారు బాలయ్య బేల్దారి పని చేస్తుంటారని తెలిపారు. పనికి వెళ్లే సమయంలో సులభంగా దొంగతనాలు చేయవచ్చని ప్లాన్ వేసి.. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. నిందితులు నరసరావుపేట పట్టణం రూరల్ వినుకొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ఏడాది ఆరు దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి సుమారు రూ.80 లక్షలు విలువైన చోరీ సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు. ఇందులో సుమారు 610 గ్రాముల బంగారం, రెండు ల్యాప్‌టాప్‌లు, ఐదు గడియారాలు, చోరీ సొత్తుతో కొనుగోలు చేసిన ఆటో, బైక్ ఉన్నట్లు చెప్పారు. వీరిని పట్టుకోవడంలో.. కీలకంగా పనిచేసిన మొదటి పట్టణ సీఐ షేక్ ఫిరోజ్, ఎస్సై వంశీకృష్ణ, ఏఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది సీహెచ్ వీరాంజనేయులు, బి.మురళీకృష్ణ, కె.తిరుమలరావు, ఎస్.పాండురంగారావు, పి.కోటేశ్వరరావు, పి.దుర్గాను ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

42,133 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 38,257 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,133 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,334 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	11500	14300
334	10000	18500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11500	16000	334	10500	18000
273	---	---	నెంబరు. 5	12000	16400
341	10000	17500	341	11500	18000
4884	---	---	4884	11000	14500
సూపర్ 10	---	---	సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	16000	తేజ	11000	16000
షార్క్-1	----	---	బ్యాడిగి	10000	18500
బ్యాడిగి	11000	18300	దేవనూరు డీలక్స్	10500	17500
దేవనూరు డీలక్స్	11000	17500	తాలుకాయలు	5000	9000

నేడు పెమ్మసాని, నారాయణ, శ్రావణ్‌కుమార్ సమావేశం

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల సమస్యల నేపథ్యంలో శనివారం ఉదయం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సమావేశం కానున్నారు. సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు రాజధాని అంశాలపై ఈ ముగ్గురూ దృష్టి సారించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు భేటీ కానున్నారు. సమస్యలపై సీఆర్డీఏ కమిషనర్‌తో చర్చించనున్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో ఇటీవల రైతు జేఏసీ గుంటూరులో సమావేశమై ప్రభుత్వం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జరుగుతున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

మండల పరిషత్ సమావేశంలో బడ్జెట్ ఆమోదం

దాచేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సగం మంది సభ్యులే హాజరయ్యారు. శుక్రవారం దాచేపల్లి మండల పరిషత్ సమావేశంలో 12మంది సభ్యులు ఉండగా ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీతో కలిపి ఐదుగురు సభ్యులు ఉండటంతో కోరం సరి పోయింది. మండలంలో మొత్తం 12మంది ఎంపీటీసీ సభ్యులు వైసీపీకి చెందిన వారే. సమావేశానికి ఇన్‌చార్జ్ ఎంపీపీ కందుల జాన్ అధ్యక్షత వహించగా ఎంపీడీవో వెంకటేశ్వరరావు బడ్జెట్ గురించి సభ్యులకు చదివి విన్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వీరయ్య రామాంజమ్మ, ఉమ, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

మోర్జంపాడులో సామూహిక స్వచ్ఛ భారత్

మాచవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శుక్రవారం సామూహిక స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన క్లాప్ మిత్రలను మోర్జంపాడు గ్రామానికి తరలించి సామూహిక స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఈవోఆర్డీ, ప్రసాదు, పంచాయతీ కార్యదర్శి ఖాన్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొని సామూహిక స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మిగిలిన గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఈవోఆర్డీ ప్రసాదు తెలిపారు.

షాపు ముందు పోసిన మట్టిదిబ్బల తొలగింపు

దాచేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో శ్రీలక్ష్మి గత రెండేళ్లుగా చిల్లర కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తుంది. గ్రామంలో కొంతమంది వ్యక్తులు ఆమె కొట్టును ఖాళీ చేయించాలనే ఉద్దేశంతో దుకాణం తెరవకుండా లారీతో మట్టి తెచ్చి షాపు ముందు పోశారు. తన ముగ్గురు కుమార్తెలతో షాపు నుంచి వచ్చే ఆదాయంతోనే జీవిస్తున్నానని, తనకు రక్షణ కల్పించాల్సిందిగా శ్రీలక్ష్మి తహసీల్దార్‌కు, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ షాపు ముందు పోసిన మట్టి కుప్పలు తొలగించి శ్రీలక్ష్మికి ఇబ్బందులు లేకుండా చేశారు.

జాబ్‌కార్డుల మంజూరు, తొలగింపునకు నేడు ప్రత్యేక గ్రామసభలు

నకరికల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కొత్తగా జాబ్‌కార్డు పొందాలన్నా, ఉన్న కార్డు తొలగించుకోవాలన్నా ఈ నెల 22వ తేదీన ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఆయా గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కావాలనుకొనే వారు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పంచాయతీ కార్యదర్శికి ఉద్యోగోన్నతి

నకరికల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నకరికల్లు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కొమ్మవరపు వెంకటశివప్రసాదుకు డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. అంతేగాక ఉద్యోగోన్నతి పొందిన కేపీ శివప్రసాదును పల్నాడు జిల్లాకు కేటాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. శివప్రసాదును మండల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కాశయ్య, ఎంపీపీ అనురాధ అభినందనలు తెలిపారు.

రాజుపాలెం ఎస్‌ఐగా మణికృష్ణ

రాజుపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం ఎస్‌ఐగా సీహెచ్ మణికృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన వేణుగోపాల్ బదిలీపై వెళ్లటంతో రొంపిచర్ల మండల ఎస్‌ఐ మణికృష్ణ ఇక్కడకు వచ్చారు.

పేద విద్యార్థికి రూ.15వేల ఆర్థికసాయం

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామ ఐటీఐ కళాశాలలో చదువుకుంటున్న లేమల్లె గ్రామా నికి చెందిన పేద విద్యార్థి సీహెచ్ సాయిరాంకు రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి కె. కిరణ్ స్థానిక టీడీపీ నాయకులతో కలసి విద్యార్థికి నగదును అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఆవాస్ + 2.0పై అవగాహన

బెల్లంకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాయపాలెంలో శుక్రవారం గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఆవాస్ + 2.0పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ జోగారావు మాట్లాడుతూ గ్రామంలో నిరు పేదలకు ఆవాస్ + 2.0 ఎంతో ఉపయోగపడుతుందన్నారు. హౌసింగ్‌శాఖ ఆధ్వర్యంలో సంపూర్ణ సహకారం అందిస్తామని వివరించారు.

రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు.. ప్రయాణికుల పాట్లు

పెదకూరపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు-సత్తెనపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెదకూరపాడు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వేట్రాక్ మరమ్మతులు శుక్రవారం నిర్వహించటంతో సత్తెనపల్లి నుంచి అమరావతి, పెదకూరపాడు నుంచి సత్తెనపల్లి వెళ్ళే ప్రయాణీకులు ఇబ్బందులకు గురయ్యారు. ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ ద్విచక్ర, కారుల్లో ప్రయాణించే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెదకూరపాడు నుంచి గుంటూరు వెళ్ళే ప్రయాణీకులు సైతం సిరిపురం వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతుల వల్ల ఇబ్బందులు పడ్డారు.

రింగ్ రోడ్డుకు పొలం ఇవ్వటానికి సమ్మతమే..

ఓఆర్‌ఆర్‌కు పొలం ఇవ్వటానికి తమకు ఎలాంటి ఇబ్బంది లేదని మండలంలోని జలాలపురం గ్రామానికి చెందినన రైతులు తెలిపారు. మండలంలోని జలాలపురంలో శుక్రవారం రాత్రి రైతులు సమావేశమయ్యారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వపరంగా అందించిన సహాయం ఓఆర్ఆర్ భూములు ఇచ్చే రైతులకు కూడా ఇవ్వాలని వారు కోరారు.

వాగ్దేవీ ఫార్మసీ కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రాం

గురజాలటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాగ్దేవీ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఇండక్షన్ ప్రోగ్రాం సందర్భంగా బీఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. అధ్యాపకులకు వర్క్‌షాపులు, గ్లాసియర్, ప్రయోగాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవల్లి సుబ్బారావు, బి.శ్రీనివాసరావు, పావులూరి పుల్లయ్య, అనంతరామయ్య పాల్గొన్నారు.


కోత దశలో ఉన్న వరిపైరు

రైతుల్లో తుఫాన్ గుబులు

● నిలిచిన వరికోతలు

పిడుగురాళ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తుఫాన్‌తో రైతుల్లో ఆందోళన మొదలైంది. పల్నాడు ప్రాంతంలో ఇప్పుడిప్పుడే వరికోతలు, నూర్పిడిలు ఆరంభించిన రైతులకు తుఫాన్ ప్రభావంతో కొందరు వడివడిగా వరికోత యంత్రాల సాయంతో నూర్పిడిలు చేపట్టగా మరికొందరు నూర్పిడిలు వాయిదా వేసుకున్నారు. గత నెలలో మొంథా తుపాన్ దిగుబడిపై ప్రభావం చూపింది. గత ఏడాది పల్నాడులో ఎకరానికి 30-35 బస్తాల మధ్య దిగుబడి రాగా తుఫాన్ ప్రభావంతో వరిపైరు పూర్తిగా నేలకొరగటం, ఈ ఏడాది 25-30 బస్తాల లోపు దిగుబడి కనిపిస్తుంది. పెట్టుబడులు పెరిగి దిగుబడి తగ్గటంతో రైతులు కాస్త ఆందోళన చెందుతున్న తరుణంలో మరలా సెన్‌యార్ తుపాన్‌తో మరింత ఆందోళనకు గురవుతున్నారు. 24వ తేదీన వాయుగుండం 26వ తేదీకి తుపాన్‌గా మారే అవకాశం వుండటంతో ఈ ప్రభావం ఐదారు రోజుల పాటు కనిపించే అవకాశం వుండటంతో రైతులు నూర్పిడిలపై సందిగ్ధంలో పడ్డారు. మరోవైపు ఇప్పటికే నూర్పిడిలు చేసిన రైతులు పశుగ్రాసం తడవకుండా ఇళ్లకు చేర్చి వాములు వేసి పట్టలు కప్పుకునే పనిలో నిమగ్నమయ్యారు.

సత్రశాల హుండీ ఆదాయం రూ.66,980

రెంటచింతల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీకమాసంలో హుండీ ఆదాయం రూ.66,980 వచ్చినట్లు సత్తెనపల్లి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి చెప్పారు. శుక్రవారం ఆలయంలో హుండీ లెక్కించగా దర్శన టిక్కెట్ల ద్వారా రూ.76,460 రాగా మొత్తం ఆదాయం రూ.1,43,440 లభించిందన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవీ శివయ్య, పాలకమండలి సభ్యులు బ్రహ్మాచారి, చంద్రశేఖరరెడ్డి, అనంతరాములు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా స్వరూపరాణి

రెంటచింతల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా ఎస్.స్వరూపరాణిని నియమిస్తూ జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె నాదెండ్ల నుంచి బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఇప్పటి దాకా ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావును నాదెండ్లకు బదిలీ చేశారు. ఎంపీడీవో శనివారం గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించనున్నారు.

కోటప్పకొండ తరహాలో దైద అభివృద్ధి


పూజలు నిర్వహిస్తున్న నిఖిల్

గురజాలటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తరహాలో దైదలోని శ్రీఅమరలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామని టీడీపీ గురజాల నియోజకవర్గ యువ నేత యరపతినేని నిఖిల్ అన్నారు. శుక్రవారం అమరలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, మద్దినేని లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ వెంబటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు యరపతినేని నిఖిల్ శుక్రవారం స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పమాల ధరించారు. అనంతరం దైద అమరలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు.

ఓటరు మ్యాపింగ్‌పై ముగిసిన శిక్షణ

రెంటచింతల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఓటర్లజాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో భాగంగా బీఎల్వోలకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసినట్లు తహసీల్దార్ మేరీ కనకం చెప్పారు. 2002 ఓటరు జాబితాని ప్రస్తుత జాబితాలోని ఓటర్లకు మ్యాపింగ్ చేయడంపై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

సేవా పుస్తకాలు, లంచ్‌బాక్సులు అందజేత

దుర్గి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి, నిదానంపాడు, కంచరగుంట, అడిగొప్పుల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ నేతలు సేవా పుస్తకాలు, లంచ్‌బాక్సులు అందజేశారు. అనంతరం ఎస్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు షేక్ నబీసాహెబ్, రాష్ట్ర జిల్లా కౌన్సిల్ సభ్యులు జీసీహెచ్ అనంతరామయ్య, యర్రం ఏడుకొండలు, మంగళానాయక్, సైదారావు, శ్రీనివాసరావు, అపర్ణ, హెచ్‌ఎంలు బాబుల్లా, బాలసుబ్రహ్మణ్యం, శివయ్య పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే పత్తికి అధిక ధర

డీఏవో జగ్గారావు

క్రోసూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పత్తి విక్రయంలో రైతులు నిబంధనలు పాటిస్తే మంచి ధర పొందవచ్చని డీఏవో ఎం జగ్గారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పీసపాడులో పత్తి నిల్వ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎర్రబాలెం రైతు సేవా కేంద్రంలో పత్తి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు 8శాతం తేమ ఉన్న పత్తిని తీసుకువెళితే క్వింటాకు రూ.8,110 ధర లభిస్తుందన్నారు. కిసాన్ కపాస్ యాప్‌లో రైతులు రెండుసార్లు స్లాటు బుక్ చేసుకొని రద్దు చేసుకుంటే మూడోసారి బుక్ చేసుకోవటానికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. రైతులు పత్తిని లూజు రూపంలోనే కేంద్రానికి తీసుకు వెళ్ళాలని, ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిషేధించామన్నారు. పత్తి 40 క్వింటాళ్ళు దాటితే తగిన ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుందన్నారు. క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో జీడీసీఎంఎస్ ఎరువుల అమ్మకం కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు అందజేశారు. ఏవో వేణుగోపాల్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.


పీసపాడు కేంద్రంలో పత్తిని పరిశీలిస్తున్న డీఏవో జగ్గారావు

ఎస్కేప్ చానల్‌కు గండి.. పూడ్చిన అధికారులు


గండిని పూడ్చుతున్న దృశ్యం

కారంపూడి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వినుకొండ రహదారిలోని సాగర్ కుడికాలువ పక్కన ఎస్కేప్ ఛానల్‌కు గురువారం రాత్రి 11 గంటల సమయంలో గండిపడింది. కుడి కాలువ నుంచి ఎస్కేప్ ఛానల్ ద్వారా నీరు వదలడానికి ఏర్పాటు చేశారు. కాగా సాగర్ కుడి కాలువ నీరు పక్కదోవ పట్టకుండా కొంతకాలంగా పూడ్చివేశారు. నాగులేటి పరిసర ప్రాంతాల్లో 3 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఎస్కేప్ ఛానల్ ద్వారా నీరు వదిలితే 3 వేల ఎకరాలు సాగులోకి వస్తుంది. కొందరు రైతులు ఎస్కేప్ ఛానల్ ద్వారా కాలువకు కొద్ది రోజుల క్రితం చిన్న గండి పెట్టారు. అయితే అది పెద్దదిగా మారడంతో నీటి ప్రవాహాన్ని ఆపలేకపోయారు. గండిపడిన సమాచారం అందుకున్న నీటి పారుదల శాఖాధికారులు శ్రీచక్ర సిమెంట్ వారి సహకారంతో ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లతో మట్టి తోలించి గండిని పూడ్చారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మాచర్ల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహించిన ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, గాదె కిరీటిరెడ్డి, గణేష్, మాచర్ల వాసు, సుందరరావు, పుల్లారావు, ఆయేషా సుల్తానా, శ్రీనివాసరావు, స్వరూప, గ్రంథాలయ అధికారి మాచర్ల మెర్సీ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్

విద్యార్థులకు గోల్డెన్ స్టార్ అవార్డులు

మాచర్ల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలురోన్నత, బాలికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఎఫ్ఏ-2 పరీక్షల్లో ప్రతిభ చూపిన ప్రతి తరగతిలోని 10 మంది విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ తరుపున ప్రాజెక్ట్ డైరెక్టర్ జూపల్లి గంగాధరబాబు శుక్రవారం గోల్డెన్‌స్టార్ అవార్డులను అందించారు. జడ్పీ బాలురోన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకొని ఎదగాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు

క్రోసూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకొని క్రమశిక్షణతో ఎదగాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం క్రోసూరు శాఖా గ్రంథాలయంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారం రోజులుగా జరిగిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కాండ్రు కాశయ్య, జైభారత్ విద్యాసంస్థల డైరెక్టర్ పీ జయనేంద్రారెడ్డి, విద్యార్థులకు పుస్తక పఠనం, ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు మైసూర్‌బాబు అధ్యక్షత వహించారు. గ్రంథాలయ అధికారి వై వీరాంజమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో జడ్పీహెచ్‌ఎస్ బాలురు ప్రథమస్థానం

మాచర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన పట్టణంలోని సత్యసాయి విద్యావిహార్ స్కూల్‌లో నిర్వహించిన ఇంటర్ స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో పట్టణంలోని జడ్పీ బాలురోన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు. సత్యసాయి విద్యా విహార్ స్కూల్ రెండోస్థానం, కిడ్స్ పాఠశాల మూడోస్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో జిల్లా బీజోన్ సెక్రటరీ, బాలుర జడ్పీహెచ్‌ఎస్ పీఈటీ అనిల్, అక్కినేని అనిల్, జక్కా శ్రీనివాసరావు, వై రమాదేవి, మధురవాణి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా రూపకల్పనలో బూత్ లెవల్ ఆఫీసర్ల పాత్ర కీలకం

● తహసీల్దార్ నాగరాజు

క్రోసూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా రూపకల్పనలో బూత్ లెవల్ అధికారుల పాత్ర కీలకమని తహసీల్దార్ వీవీ నాగరాజు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌వోల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బూత్ లెవల్ అధికారులు 6, 7, 8 ఫారాలపై, బీఎల్‌వో యాప్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్‌వోలు నిర్లక్ష్యం వహించకూడదని ఆయన తెలిపారు. మండలంలోని 57 మంది బీఎల్‌వోలు శిక్షణలో పాల్గొన్నారు.

నేడు కోడిపోరు

కారంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వీరారాధన ఉత్సవాల్లో భాగంగా శనివారం కోడిపోరు నిర్వహించనున్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కోడిపోరులో పాల్గొననున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నకరికల్లు హైస్కూల్ విద్యార్థులు

నకరికల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-17 బాలుర ఖోఖోలో ఈనెల 22న కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో నకరికల్లు హైస్కూల్‌కు చెందిన షేక్ నబీరసూల్ బాలికల విభాగంలో, విజయనగరంలో 23న జరిగే పోటీల్లో ధూపాటి రంగమహాలక్ష్మి పాల్గొంటారని హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు తెలిపారు. అండర్ 14 బాలికల కబడ్డీలో 22న మచిలీపట్నంలో జరిగే పోటీల్లో తిరుమలశెట్టి లిఖిత, బాలుర విభాగంలో 23న బాపట్ల జిల్లా చందులూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కొలుపుల పూడి శివనిఖిల్, పుట్లగుంట రుద్ర శివ గణేష్ పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఈటీలు, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లికార్జునరావు అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నకరికల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

వేగవంతంగా అభివృద్ధి పనులు

● డిసెంబరు నాటికి పూర్తికానున్న రూ.10 కోట్ల పనులు


పిడుగురాళ్లలో డివైడర్‌కు అందంగా రంగులు వేస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పట్టణాన్ని ఆదర్శంగా, సుందరంగా తీర్చిదిద్దుతానన్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట నేడు కార్యరూపం దాల్చుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు వార్డుల్లో పింఛన్ల పంపిణీ, పర్యటనలకు వెళ్లిన ఎమ్మెల్యేకి ఆ ప్రాంత ప్రజలు పార్టీ నేతల నుండి పలు ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రైనేజి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తులు అందడంతో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు, విద్యుత్ దీపాలు, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణాలను త్వరిగతిన పూర్తిచేసి డిసెంబరు నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఎమ్మెల్యే, అధికారులను ఆదేశించారు. బీపీఎస్ నిధులు సుమారుగా 3 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు 89 లక్షలు, వుడా నిధులు 50 లక్షలు, మున్సిపల్ జనరల్ ఫండ్ 2 కోట్లు, డీఎంఎఫ్‌టీ నిధులు 3.70 లక్షలను ఎమ్మెల్యే పట్టణాభివృద్ధికి కేటాయించడంతో గత నెల నుండి పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి పనులు వేగవంతం అయ్యాయి. ఇప్పటికే పలు పనులు పూర్తికాగా పట్టణానికి కొత్త లుక్ వచ్చినట్లు వుంది. జనవరి నాటికి పట్టణానికి కొత్త రూపురేఖలు రానున్నాయి.


30వ వార్డులో వేస్తున్న సీసీ రోడ్డు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన మున్సిపల్ కార్యాలయ నూతన భవనం

సత్రశాలలో న్యాయాధికారి ప్రియదర్శిని ప్రత్యేక పూజలు


హారతులిస్తున్న న్యాయాధికారి ప్రియదర్శిని

రెంటచింతల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని జిల్లా న్యాయాధికారి ప్రియదర్శిని శుక్రవారం సందర్శించారు. ఆలయంలో కుంకుమార్చన చేశారు. పోలి పాడ్యమిని పురస్కరించుకుని తొలుత కృష్ణానదిలో హారతులిచ్చారు. ఈవో గాదే రామిరెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రిని కలసిన ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, మంత్రి లోకేశ్‌లను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం కలిశారు. ప్రజలకు వద్దకు ప్రవీణ్ వంద రోజుల్లో వంద గ్రామాల పర్యటనపై వారితో చర్చించి ఈ సందర్భంగా సీఎం చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రవీణ్ వారిని కోరారు. ప్రజల వద్దకే పాలన స్ఫూర్తితో సమస్యలను గ్రామంలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని రూపొందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.


సీఎం చంద్రబాబుతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

వాడ బలిజ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు


సీఎం చంద్రబాబును కలసి సమస్యలు వివరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి

నకరికల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లో వాడ బలిజ కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడును కోరినట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి తెలిపారు. శుక్రవారం చంద్రబాబును కలసిన ఆయన గతంలో మాదిరిగా కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లోని వాడ బలిజ కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా కృషిచేయాలని కోరగా చంద్రబాబు కచ్చితంగా చేస్తామని చెప్పారన్నారు. కుంకలగుంట గ్రామంలో మెయిన్ రోడ్డు, సీసీ డ్రెయిన్‌ల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరినట్టు తెలిపారు. చేజర్లలో నిలిచిపోయిన బేతరాజు చెరువు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను కొనసాగించేలా చూడాలని కోరానన్నారు. సమస్యల పరిష్కార దిశగా అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ సక్సెస్..

● శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి

రెంటచింతల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష పార్టీలు ఎన్ని విమర్శలు చేసినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేసి సూపర్‌సిక్స్‌ను సక్సెస్ చేశారని శిల్పారామం చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని పార్టీలకతీతంగా అందరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. వ్యవసాయాన్ని లాభాపేక్షగా మార్చాలనే ఉద్దేశంతో రైతులకు రోటావేటర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ల వంటి వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై ప్రభుత్వం అందచేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు కృషివల్ల రాష్ట్రానికి పారిశ్రామిక పెట్టుబడులు వరదలా వస్తున్నాయన్నారు. సమావేశంలో మండలపు హనిమిరెడ్డి, సొసైటీ చైర్మన్ అల్లం నాగలక్ష్మిబ్రహ్మారెడ్డి, టీడీపీ మండల ప్రధా నకార్యదర్శి పోట్ల సతీష్, తెలుగు యువత నియోజకవర్గ నేత తాడపనేని కోటేశ్వరరావు, తుఫాన్‌రెడ్డి, టి.కోటిరెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

పత్తిలో అంతర సాగుపై రైతులకు శిక్షణ


రామాపురంలో పత్తిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దాచేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞానకేంద్రం దర్శి ఆధ్వర్యంలో మండలంలోని రామాపురంలో పత్తి రైతులకు పంటలో అంతర సాగుపై శిక్షణ ఇచ్చారు. సేద్యం విభాగం అధికారి డాక్టర్ టీ వెంకటేశ్వర్లు, కేవీకేలు మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో గులాబీరంగు పురుగు నివారణ గురించి రైతులకు వివరించారు. పత్తి తరువాత రెండో పంటగా మొక్కజొన్న, వరిగ, శనగపంటలను సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దాచేపల్లి ఏవో వెంకటేశ్వర్లు, కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది కే భవ్య, ఎం వెంకటేశ్వర్లునాయక్, వివేక, వై భువనేశ్వరి పాల్గొన్నారు.

కుటుంబంలో ఓట్లన్నీ ఒకేచోట

● బీఎల్‌ఓలకు శిక్షణలో తహసీల్దార్


మాట్లాడుతున్న తహసీల్దార్ మధుబాబు, ఎన్నికల డీటీ సుబ్బారావు తదితరులు

పిడుగురాళ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒక కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో వుండేలా బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాను సవరించాలని తహసీల్దార్ మధుబాబు, ఎన్నికల డీటీ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించి బీఎల్‌ఓ ఇంటింటికి క్షేత్రస్థాయిలో వెళ్లి ఓటర్ వివరాలు తెలుసుకుని ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు.

తంగెడ మేజరు చివరి భూములకు నీరు

దాచేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు మాచర్ల డివిజన్ పరిధిలోని తంగెడ మేజరు కాలువకు మిర్చి పంటకు సకాలంలో నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీన ఆంధ్రజ్యోతిలో తంగెడ మేజరు కాలువ చివరి భూములకు నీరివ్వాలి అన్న శీర్షికకు ఆయన స్పందించారు. తంగెడ కాలువలో నాచు, తూటి కాడ, గుర్రపుడెక్క తొలగించిన తరువాత ఆయకట్టుకు నీరు అందిస్తామన్నారు. కాలువ పరిధిలోని మిరపపంటకు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు వివరించారు.

కళ్లకు కట్టిన మంద పోరు..

- వేడుకగా పల్నాటి వీరారాధన ఉత్సవాలు
- నాగులేటిలో వీరాచారవంతుల కొణతాలకు స్నానం
- కులమతాలకు అతీతంగా చాపకూడు
- సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు



కన్నమదాసు ఖడ్గాన్ని చేతబూనిన కలెక్టర్ కృత్తికా శుక్లా

కారంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో మూడో రోజు శుక్రవారం మందపోరు, చాపకూడు కార్యక్రమం వీర్ల దేవాలయంలోని చాపకూడు మందిరంలో నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులు తమ కొణతములకు నాగులేటిలోని గంగధార మడుగులో స్నానమాచరింపజేసి అలంకరించారు. మహిళలు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వెంట పొంగళ్లతో వీర్ల దేవాలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా బయలుదేరి చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించారు. బ్రహ్మనాయుడు విగ్రహం, పీఠాధిపతి నివాసం వద్ద కత్తిసేవ చేశారు. మహిళా వీరాచారవంతులు అంకమ్మ పెట్టెలతో తరలివచ్చారు. అందరూ ఊరేగింపుగా అంకాళమ్మ ఆలయానికి పూర్వీకుల ఆయుధాలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాళమ్మ అమ్మవారికి కొలుపులు చేశారు. అంకమ్మ పెట్టెలతో అమ్మవారికి సంబంధించిన వస్తువులు, గాజులు, ఫొటో, కుంకుమ తదితర సామగ్రితో తరలివచ్చారు. రాత్రివేళ పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారును ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా వీర్ల దేవాలయం వద్దకు తీసుకొని వచ్చారు. అక్కడ రాచగావు మండపంలో బ్రహ్మనాయుడు స్థానంలో పీఠాధిపతి ఆశీనులు కాగా వీర విద్యావంతులు మందపోరు కథను గానం చేశారు. ఆవుల మందకు కాపలాగా ఉన్న గోపన్నను నాగమ్మ సైన్యం హతమార్చడం ఘటనను ఆలపించారు. ఆవుల మందను ముట్టడించడమే మందపోరుగా మూడో రోజున నిర్వహించారు. పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులకు కంకణ ధారణ చేశారు. మందపోరు ఘట్టాన్ని విజయవంతంగా ముగించారు.

కులమతాలకు అతీతంగా చాపకూడు

బ్రహ్మనాయుడు ఆశించిన సర్వమత సమ్మేళనంలో భాగంగా వీరారాధన ఉత్సవాల్లో మూడో రోజున మంద పోరులో భాగంగా వీర్ల దేవాలయ ఆవరణలో చాపకూడు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహపంక్తి భోజనం చేశారు. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అన్నపురాసుల వద్ద



గ్రామోత్సవంలో కొణతములు

ప్రత్యేక పూజలు జరిపారు. 900 ఏళ్ల క్రితమే కులమతాలకు అతీతంగా చాపకూడును పల్నాటి బ్రహ్మనాయుడు నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు, ఎస్పీ కృష్ణారావు, గురజాల డీఎస్పీ జగదీష్, ఆర్డీవో మురళీకృష్ణలు సహపంక్తి భోజనం చేశారు. వీరుల దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మనాయుడు నృసింహకుంతాన్ని చేబూనారు. కన్నమదాసు ఖడ్గాన్ని కలెక్టర్ కృత్తికా శుక్లా చేబూనారు. ముందుగా ఉత్సవాలకు విచ్చేసిన ప్రజాప్రతినిధులకు కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి అంజయ్య, వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, బొల్నేడి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, మనుగోటి సత్యం, చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జాని, ఎస్‌పీఆర్ కృష్ణ, పూర్ణయ్య, కర్నాటి మహేష్ పాల్గొన్నారు.

నేడు కోడిపోరు

పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన శనివారం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కోడిపోరును నిర్వహించనున్నారు. పల్నాటి యుద్ధానికి ప్రధాన కారణమైన కోడి పందెలను కోడిపోరు పేరుతో వీర్ల దేవాలయ ప్రాంగణంలో జరపనున్నారు. ఈ పోరును వీక్షించేందుకు వేలాదిగా ప్రజలు తరలిరానున్నారు.

బ్రహ్మనాయుడి ఆశయాలను కొనసాగిద్దాం

కులమతాలకు అతీతంగా బ్రహ్మనాయుడు ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మాల వర్గీయుడు కన్నమదాసును సర్వ సైన్యాధ్యక్షునిగా బ్రహ్మనాయుడు చేశారన్నారు. బ్రహ్మనాయుడు మానవతావాది, సాంఘిక విప్లవవాదన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటికీ అమలవుతున్నాయన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు మాట్లాడుతూ వీరులకు పూజలు చేయడం రోమ్ నగరంలో ఉందని, తరువాత కారంపూడిలో మాత్రమే ఉందన్నారు.



పొంగళ్లతో మహిళలు, ఎమ్మెల్యే జూలకంటి



కన్నమదాసు విగ్రహం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు



చాపకూడు మంటపంలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

అంత..వేడల్పా..!?

(5వ పేజీ తరువాయి)

చేయాలని కోరింది. ఆ మేరకు సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక ఓఆర్ఆర్ కోసం 250 మీటర్ల వెడల్పుతో 190 కిలోమీటర్ల పొడవునా భూసేకరణ చేపట్టాలని నిర్ణయించడంపై భూములు కోల్పోయే రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో ఆగ్రహం..

ఓఆర్ఆర్ ఫైనల్ డీపీఆర్‌ని కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు కొన్ని నెలల క్రితం పంపించారు. అందులో 140 మీటర్ల వెడల్పునకు పరిమితమై భూసేకరణ చేపడతామన్నారు. ప్రాజెక్టు ఖర్చు రూ. 24,791 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం కూడా తెలిపారు. భూసేకరణకు అయ్యే ఖర్చు రూ.3,117 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే తన వాటాగా భరించేందుకు అంగీకారం తెలిపింది. దీనిపై రైతులు పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఎప్పుడైతే ఎవరి అభిప్రాయాలను తీసుకోకుండా భూసేకరణని 250 మీటర్ల వెడల్పునకు నిర్ణయించి కలెక్టరేట్‌లకు ప్రతిపాదనలు పంపించారో అప్పటి నుంచి రైతులు ఆగ్రహం వెల్లుబుకుతోంది. అంత వెడల్పుతో భూసేకరణ చేపడితే తాము భూములను సింహభాగం కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అంత పెద్ద హైదరాబాద్ ఓఆర్ఆర్‌నే 150 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. అందులో ఎనిమిది వరసల రహదారి, మీడియన్, ఇరువైపులా సర్వీసు రోడ్లు, గ్రీన్ స్పేసెస్ ఉన్నాయి. దాని కంటే అదనంగా మరో 100 మీటర్ల వెడల్పుతో అమరావతి ఓఆర్ఆర్ భూసేకరణ చేపట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.



భూసేకరణకు ఖర్చు రెట్టింపు

అమరావతి ఓఆర్ఆర్ కోసం ఎన్‌టీఆర్ జిల్లాలోని 4 మండలాల్లో 18 గ్రామాల్లో 51.120 కిలోమీటర్లు, ఏలూరులో ఒక మండలంలోని 8 గ్రామాల్లో 18.760 కిలోమీటర్లు, కృష్ణ జిల్లాలో ఐదు మండలాల్లోని 22 గ్రామాల్లో 35.140 కిలోమీటర్లు, గుంటూరు జిల్లాలోని 11 మండలాల్లో 40 గ్రామాల్లో 67.650 కిలోమీటర్లు, పల్నాడు జిల్లాలో 2 మండలాల్లో 9 గ్రామాల్లో 17.230 కిలోమీటర్ల పొడవునా నిర్మించేందుకు ఎలైన్‌మెంట్ చేశారు. ఓఆర్‌ఆర్‌కి లింకుగా మరో రెండు రోడ్లను కూడా 19.300 కిలోమీటర్లతో నిర్మించనున్నారు. పెరిగిన వెడల్పు ప్రకారం భూసేకరణకే రూ.5 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని అంచనా. పైగా పెంచిన వెడల్పు కారణంగా పలు పరిశ్రమలు, నివాసిత ప్రాంతాలను కూడా తొలగించాల్సి ఉంటుంది. వాటికి నష్టపరిహారం రూపంలో అదనంగా ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నాలుగు నెలల క్రితం అమరావతి ఓఆర్‌ఆర్‌ని ఆరు వరసలు, ఇరువైపులా సర్వీసు రోడ్లకు మాత్రమే ఆమోదం తెలిపింది. అప్పుడు 140 మీటర్ల వెడల్పునకే ప్రతిపాదించింది. ఇప్పుడు 250 మీటర్లు అంటే ఆ వెడల్పులో భూమిని తీసుకొని ఏ అవసరాలకు రిజర్వు చేసి పెట్టుకొంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

యూరియా బస్తా... రూ.500

(5వ పేజీ తరువాయి)

వాడుతున్నట్లు వ్యవసాయ శాఖ ఎప్పుడో గుర్తించింది. పల్నాడు ప్రాంతంలో మిరప రైతులు కూడా యూరియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. మాచర్లలో యూరియా రూ.420 నుంచి రూ.460కి తక్కువ అమ్మే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో చాలాచోట్ల రూ.450 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు. కొందరు రైతుల పేరుతో కొందరు, పలుకుబడి ఉపయోగించి మరికొందరు ముందుగానే కొనుగోలు చేసి వాటినే రైతులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

మేలుకోకపోతే ముప్పే..

ఖరీఫ్‌లో కేటాయింపులకు మించి ప్రభుత్వం యూరియాను సరఫరా చేసింది. అయినా కొరత ఉన్నట్లు ప్రచారం జరిగింది. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు వెళ్లిన వందల టన్నుల యూరియా కొందరికి మాత్రమే పంచేయడంతో వాస్తవ రైతులు కొరతతో ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో రబీలో ఎలా ఉంటుందోనన్న దానిపై సందిగ్ధం ఏర్పడుతుంది. వాస్తవానికి రబీలో గుంటూరు జిల్లాకు 55840 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం అవుతుంది. కానీ నిల్వలు ఆ మేరకు వస్తాయా లేదా అన్న దానిపై అనుమానం నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం నిల్వల్లో 70 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీ లకు, 30 శాతం డీలర్లకు కేటాయిస్తుంది. లింక్ ఉత్పత్తులు తీసుకుంటేనే యూరియా ఇస్తామని డీలర్లు చెబుతున్నాయి.

అక్షరం అండగా.. సమస్యలు పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

గాయత్రినగర్, కొట్నాల్పు వీధివాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల సమస్యల ఆంధ్రజ్యోతి ద్వారా పరిష్కారం అయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. గాయత్రినగర్ కాల్వ కట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని మహిళలు కోరగా రూ.45 లక్షలతో నిర్మించారు. ఈ పనులకు జీవీ శుక్రవారం ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి వేదికగా సమస్యలు పరిష్కారం : జీవీ

కొట్నాల్పువీధి, గాయత్రినగర్‌లో రెండు నెలల్లో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించడం ఇది అక్షర విజయమని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆంధ్రజ్యోతి - ఏబీఎన్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రూ.63.60 లక్షలతో ప్రజలు కోరినట్లు రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా ఆంధ్రజ్యోతి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో అభినందనీయమన్నారు. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ప్రజాసమస్యలు తీసుకెళ్లి పరిష్కరించగలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. వినుకొండలో ఆంధ్రజ్యోతి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు విని, పరిశీలించి రెండు నెలల్లో పరిష్కారించామన్నారు. ఇటువంటి కార్యక్రమాలను భవిష్యత్‌లో ఆంధ్రజ్యోతి నిర్వహించాలని కోరారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చే సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రూ.210 కోట్లతో తాగునీటి పథకం విస్తరణ

వినుకొండలో రూ.210 కోట్లతో తాగునీటి పథకం విస్తరణ చేపట్టినట్లు జీవీ తెలిపారు. 2018లో టీడీపీ పాలనలో నీటి పథకానికి నిధులు విడుదల చేస్తే వైసీపీ హయాంలో వదిలేశారన్నారు. ఇప్పుడు మళ్లీ తాము అధికారంలోకి వచ్చాక పనులను పట్టాలెక్కించామన్నారు. నీటి పథకాన్ని త్వరతగతిన పూర్తి చేసి వినుకొండలో ఇంటింటికి మంచినీరు అందిస్తామన్నారు. రెండేళ్లలో పనులు పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు అందించడమే జీవిత ఆశయమన్నారు. వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంలో భాగంగా ప్రధాన కాల్వను నిర్మిస్తున్నామన్నారు. రూ.18 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్లును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో 20 వేల టన్నుల వ్యర్థాలు వదిలేస్తే తాము శుభ్రం చేశామన్నారు. ఐదేళ్లలో ఎస్‌ఎస్‌పీ కాలనీలో ఒక్క ఇటుక పెట్టలేదని, తాము అభివృద్ధి చేస్తామన్నారు. వినుకొండ ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కు నిర్మాణం చేపడతామన్నారు. క్రీడాభివృద్ధి కోసం స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. పల్లెల్లో కూడా ప్రతి ఇంటికి రక్షిత నీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, షకీలా దస్తగిరి, ఏఈ ఆదినారాయణ, మాజీ చైర్మన్ షమీంఖాన్, బొల్లేపల్లి వెంకట్రావు, బోడపాటి రామారావు, కొల్లి శేఖర్, పెమ్మసాని నాగేశ్వరరావు, సౌదాగర్ జానీ, పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. ఆంధ్రజ్యోతి



చీఫ్‌విప్ జీవీని సత్కరిస్తున్న గాయత్రి నగర్ వాసులు



ఏళ్ల నాటి సమస్య పరిష్కారం

గాయత్రినగర్‌లో ఏళ్ల తరబడి రోడ్ల సమస్య ఉంది. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కమిషనర్‌ను ఒక వేదికపైకి తీసుకు వచ్చింది. తమ సమస్యలను నేరుగా చెప్పుకునేలా చొరవ చూపింది. గాయత్రినగర్‌లో రహదారులు నిర్మించాలని కోరగా సీసీ రోడ్లు నిర్మించారు. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్‌కు కృతజ్ఞతలు.

-వాసిరెడ్డి లింగమూర్తి, కౌన్సిలర్

వినూత్న కార్యక్రమం



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ వినూత్న కార్యక్రమం నిర్వహించింది. గాయత్రినగర్, 23 వార్డులో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న రోడ్లు, మురుగుకాల్వ సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చింది. చీఫ్‌విప్ ఆదేశాలతో రోడ్లను నిర్మాణం చేశాం. ప్రజల సమస్యలను త్వరతగతిన పరిష్కరించేందుకు ఆంధ్రజ్యోతి దోహదపడింది.

-సుభాష్ చంద్రబోస్, కమిషనర్



రోడ్ల సమస్య పరిష్కారం

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ వినూత్న కార్యక్రమం ద్వారా రోడ్ల సమస్యలు పరిష్కారమయ్యాయి. గాయత్రినగర్, కొట్నాల్పు వీధిలో సీసీ రోడ్లు నిర్మించారు. ప్రజల సమస్యలను అధికారులు, కౌన్సిలర్లు, చీఫ్‌విప్ జీవీ దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి ఆంధ్రజ్యోతి వారధిగా వ్యవహరించింది.

-షేక్ షకీలా బేగందస్తగిరి, కౌన్సిలర్

ప్రభుత్వ సర్వీసుల్లో చేరగానే.. డాక్టర్లలో నిర్లిప్తత!

- అర్థం లేని నిబంధనలతో ప్రజలకు ఇబ్బందులు: హైకోర్టు
- శ్యామల మానసిక వైకల్యాన్ని నిర్ధారించారు..
- ఆమె శారీరక వైకల్యాన్ని పట్టించుకోరా?
- డాక్టర్ల బృందాన్ని ఆమె నివాసానికే పంపండి
- వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు న్యాయమూర్తి ఆదేశం
- తదుపరి విచారణ డిసెంబరు 1కి వాయిదా

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన నెల్లూరి శేషగిరమ్మ మనవరాలు శ్యామలకు మానసిక వైకల్యం ఉందని నిర్ధారించిన ప్రభుత్వ డాక్టర్లు.. ఆమె శారీరక వైకల్యాన్ని పట్టించుకోకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ప్రభుత్వ డాక్టర్ల వైఖరిని తీవ్రంగా తప్పుపట్టింది. మానసిక వైకల్యంతో బాధపడుతున్న శ్యామలకు సదరమ్ సర్టిఫికెట్ కోసం ఆమె కుటుంబ సభ్యులు దరఖాస్తు చేశారని.. ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించి 95 శాతం మానసిక వైకల్యంతో బాధపడుతున్నట్లు డాక్టర్లు నిర్ధారించారని గుర్తు చేసింది. మనిషిని చూసి శారీరక స్థితిని అంచనా వేయవచ్చని.. శ్యామల కనీసం నడవలేని స్థితిలో ఉన్నా డాక్టర్లు ఆ విషయాన్ని విస్మరించడం ఏమిటని ప్రశ్నించింది. ప్రభుత్వ సర్వీసుల్లో చేరగానే డాక్టర్లను నిర్లిప్తత ఆవహిస్తోందని, అర్థంలేని నిబంధనలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ప్రజలకు సేవ చేయడానికి వారు ఉన్నారనే విషయం మరచిపోతున్నారని వ్యాఖ్యానించింది. శ్యామల బహుళ వైకల్యంతో బాధపడుతున్నట్లు డాక్టర్లకు తాము చెప్పాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొంది. ఆమెకు ఏమేర శారీరక వైకల్యం ఉందో అంచనా వేసి.. వారం రోజుల్లో నివేదికను కోర్టు ముందు ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఇందుకు నిపుణులైన డాక్టర్ల బృందాన్ని శ్యామల నివాసానికే పంపించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను డిసెంబరు 1కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రకాశం బ్యారేజి గేట్లు మూసివేత

తాడేపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల నిలిపివేయడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి తగ్గింది. ఎగువ నుండి 7703 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా బ్యారేజి గేట్లు అన్ని మూసివేసి దిగువకు ఔట్‌ఫ్లో నిలిపివేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2919 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 271 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



చిన్నారులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రాయపాటి శైలజ

తాడేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక పాఠశాలల పనితీరును మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలోని 3, 7 అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న తక్కువ బరువున్న పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని రాయపాటి శైలజ సీడీపీవోను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బంది, తల్లులతో ఆమె మాట్లాడారు. చిన్నారులను పలు ప్రశ్నలు వేశారు. డాక్టర్ శైలజ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో వుంటే చిన్నారుల బరువు, ఎత్తును ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. తక్కువ బరువున్న పిల్లలను గుర్తించి న్యూట్రిషన్ రీసోర్స్ సెంటర్స్‌లో 15 రోజులపాటు ఉంచి మంచి పౌష్టికాహారం అందించి వారి బరువు పెరిగే విధంగా చూడాలని సూచించారు. దానికి వారి తల్లులు, ఆయా కేంద్రాలకు వెళ్లే విధంగా అవగాహన కల్పించాలన్నారు. స్కూలుకు వెళ్లే చిన్నారులకు హెచ్‌బి టెస్ట్ చేయించి రక్తహీనత ఉన్న చిన్నారులకు ఐరన్ సప్లిమెంట్ ఇవ్వాల్సి వుంటుందన్నారు. ఏఎన్‌ఎంలతో ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. స్కూలుకు వెళ్లని పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలకు వెళ్లేలా చూడాలన్నారు. తల్లి బిడ్డలందరిని ఒక చోట కూర్చోబెట్టి బాలామృతం, పాలు, గుడ్లు తదితర పౌష్టికాహారం ప్లిలలకు పెట్టే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆమె చిన్న చిన్న కథలపై చిన్నారులకు పలు ప్రశ్నలు వేసి వారి సమాధానాలతో ముచ్చటపడ్డారు. రోజువారీ అటెండెన్స్‌ను తనిఖీ చేశారు. టాయ్‌లెట్స్ నీట్‌గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ అడ్వయిజర్ రావూరి సూయిజ్, సెక్షన్ ఆఫీసర్ శైలజ, మంగళగిరి సీడీపీవో సరిత, ఏసీడీపీవో సౌమ్య, అంగన్‌వాడీకార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్..

కొల్లిపర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్‌లను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కోటేశ్వరరావు వివరాల మేరకు.. మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి ఇసుక రీచ్‌లను ఎస్ఐ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మున్నంగి గ్రామానికి చెందిన నాలుగు ఇసుక ట్రాక్టర్లలో ఇసుకను ఎటువంటి బిల్లులు లేకుండా తీసకెళ్లడం గుర్తించారు. కుంచవరం సమీపంలో ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కొల్లిపర మండలం వరకు మాత్రమే ఉచిత ఇసుక అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుకను తరిలిస్తే ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండవ సారీ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే రూ.20వేలు వరకు జరిమనా విధించడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు..

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు: కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో ఆవులు, గేదెలు రోడ్లపైకి విడిచిపెడితే యజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటుగా ఆయా ఆవులు గేదెలను గోశాలకు తరలించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు హెచ్చరించారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో విడిచిపెట్టిన ఆవులను గోశాలకు తరలించారు. ఆయా యజమానులకు మొదటి తప్పుగా రూ.1000, రెండోసారి రూ.5000 జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. పలు మార్లు పశువుల యజమానులను హెచ్చరించినా నిత్యం రోడ్లపైకి ఆవులను విడిచిపెడుతున్నారని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమును సద్వినియోగం చేసుకోవాలి

● మున్సిపల్ కమిషనర్

నరసరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పుర పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జారీచేసిన జీవోఎంఎస్.నెం.225, ప్రకారం భవనాలు రెగ్యులరైజ్ చేసుకునేందుకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్-2025) ద్వారా అవకాశం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. జీవో ప్రకారం రుసుం చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవచ్చని తెలిపారు. తప్పుడు సమాచారంతో అర్జీలు సమర్పిస్తే సదరు లైసెన్డ్ ఇంజనీర్ లైసెన్సు రద్దు చేస్తానని హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో బీపీఎస్, ఎల్.ఆర్.ఎస్.లపై లైసెన్డ్ ఇంజనీర్‌లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వర స్వామి

ఘనంగా భీమలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం

నరసరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాతూరు శివాలయంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా మార్గశిర శుద్ధ పాడ్యమిని పురష్కరించుకొని శుక్రవారం గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం చేశారు. తొలుత స్వామికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో ఏకాహం నిర్వహించారు. అన్నాభిషేకం అనంతరం రెండు వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

నేడు ఎస్సీ, ఎస్టీల కోసం పీజీఆర్ఎస్

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పల్నాడు కలెక్టరేట్ కార్యాలయంలో నాలుగో శనివారం అంటే 22వ తేదీన ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నామని కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం తెలిపారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు ప్రత్యేక పరిష్కార వేదికను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఏడుగురి బైండోవర్

బొల్లాపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం కేసుల్లో ఉన్న బొల్లాపల్లి మండలంలోని సరికొండపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు, వెల్లటూరుకు చెందిన ఒకరు, మేళ్ళవాగుకు చెందిన ఒకరు, గండిగనుముల పైతండాకు చెందిన ఒకరు, లింగంగుంట్ల తండాకు చెందిన ఒకరిని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. అలాగే వెల్లటూరు గణేష్ వైన్స్, బొల్లాపల్లిలో పరమేశ్వర వైన్స్ రేమిడిచర్లలో వెంకటేశ్వర వైన్స్‌లో ఆకస్మిక తనిఖీచేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నరసరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట - చిలకలూరిపేట ప్రధాన రహదారిపై కేశానుపల్లి పంచాయతీ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద స్కూలు బస్సు మోటారుసైకిలిస్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. స్కూలు బస్సు ఆపకుండా వెళ్లడంతో స్థానికులు బస్సును వెంబడించి డ్రైవరుకు దేహశుద్ధి చేశారు.

● నరసరావుపేట రూరల్: డివిజన్ పరిధిలో నూతన గృహాలు నిర్మించుకునే వారు 11కేవీ విద్యుత్ తీగలకు 4అడుగుల దూరం, 33కేవీ విద్యుత్ తీగలకు 12అడుగుల దూరంలో తమ గృహాలు నిర్మించుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ రాంబొట్ల సూచించారు.

● వినుకొండ: విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం వారి ఆధ్వర్యంలో భవన ఆవరణలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు.

● కనమర్లపూడి (శావల్యాపురం): ప్రభుత్వ పాఠశాలల్లోని రైజింగ్ స్టార్స్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి డిసెంబరు నెలాఖరుకల్లా వారికి చదవడం, రాయడం నేర్పించాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని కనమర్లపూడిలోని మెయిన్, హెచ్‌సీ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో-2 పుసులూరి లలితా కుమారితో కలసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల పోలీసు స్టేషన్ ఎస్ఐ మణికృష్ణ శుక్రవారం రాజుపాలెం పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నరసరావుపేట రెండో పట్టణ ఎస్ఐను ఇక్కడకు బదిలీ చేసినట్టు సమాచారం.

● రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలో రాష్ట్ర నూరు బాషా యువజన సంఘం అధ్యక్షుడు దూదేకుల మస్తాన్ శుక్రవారం పర్యటించారు. ఈ నెల 23న దాచేపల్లిలో ఆల్ నూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంద రోజుల పాటు వంద మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. రాష్ట్ర నూర్ బాషా యూత్ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో వంద మందికి కుట్టు మిషన్‌లు అందజేస్తామన్నారు.

నిర్లక్ష్యం అల్లుకుంటోంది

● ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చి మొక్కలు, తీగలు
● ఉదాశీనంగా విద్యుత్‌శాఖ అధికారులు



సత్తెనపల్లి రోడ్డు అయ్యప్పస్వామి ఆలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు



ఉప్పలపాడు ఎన్‌టీఆర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌లకు అల్లుకుంటున్న తీగలు

నరసరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారుల నిర్లక్ష్యంతో చిన్నపాటి గాలికి, వర్షాలకు తీవ్ర విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ప్రతి నెల రెండో శనివారం విద్యుత్‌తీగల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద చెట్ల తొలగింపు, మరమ్మతుల కోసం విద్యుత్ నిలిపి వేస్తుంటారు. కాని నరసరావుపేట మండలం ఉప్పలపాడు ఎన్‌టీఆర్ కాలనీ వద్ద మాత్రం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్‌టీఆర్ కాలనీలో ఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చూసినా తీగజాతి చెట్లు అల్లుకుపోయాయి. రెండు రోజుల క్రితం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉప్పలపాడు ఎన్‌టీఆర్ కాలనీలో పర్యటించారు. మంత్రి పర్యటన నేపథ్యంలోనైనా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. సంబంధిత ఉన్నతాధికారులు కాలనీలో పర్యటించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు అల్లుకుపోతున్న చెట్లను తొలగించాలని కాలనీ ప్రజలు కోరుకుంటున్నారు.

ఘనంగా పోలిస్వర్గం పూజలు



శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పోలిస్వర్గం పూజల్లో పాల్గొన్న భక్తులు

వినుకొండ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోస్ బొమ్మ సెంటర్‌లోని షిరిడి సాయిబాబా మందిరంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు పోలి స్వర్గం పూజా కార్యక్రమాన్ని వైభవపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పోతు కూచి వెంకట శ్రీనివాసరావుశాస్త్రి ఆధ్వర్యంలో భారీకొలను ఏర్పాటు చేసి పోలీ స్వర్గం పూజా కార్యక్రమం చేశారు కార్యక్రమంలో దోగిపర్తి వెంకట ప్రసాద్, కొల్లిపర బాలసుబ్రమణ్యం, సనిశెట్టి గురవయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారికి అభిషేకం అనంతరం పూజా కార్యక్రమంలో కార్తిక మాస పోలీ స్వర్గం గొప్పతనం గురించి భక్తులకు వివరించారు. పెరుమాళ్లపల్లి మేజర్ కాలువ నీరు ప్రవహించడంతో పలు ప్రాంతాల్లోని మహిళలు వేకువజామున కాలువ వద్ద దీపాలు వెలిగించారు.

● రొంపిచర్ల: రొంపిచర్ల, విప్పర్ల, వడ్లమూడివారిపాలెం, గోగులపాడు, సంతగుడిపాడు, కొనకంచివారిపాలెం, మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లోని ఆలయాల్లో పోలి స్వర్గం పూజలను నిర్వహించారు.

కూటమి నాయకుల తిరంగా యాత్ర



తిరంగా యాత్రలో పాల్గొన్న ప్రత్తిపాటి, కూటమి పార్టీల నాయకులు



డ్వాక్రా సంఘాలకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కాంస్య విగ్రహ ఏర్పాటు శుభపరిణామమని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా పట్టణంలోని రైతు బజారు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నెలకొల్పనున్న సర్దార్ పటేల్ కాంస్య విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన బీజేపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కూటమి పార్టీల శ్రేణులతో కలిసి జాతీయ జెండాలను చేతబూని తిరంగా యాత్రలో పాల్గొన్నారు. నాగోతు రమేష్ నాయుడు, ఏలూరి శశికుమార్, పరాంకుశం శ్రీనివాసరావు, గట్టా హేమకుమార్, మల్లెల శివనాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం సింగు కల్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సభలో బీజేపీ నేతలు మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ భిన్నత్వంలో ఏకత్వానికి విశేష కృషి చేశారన్నారు.

గొట్టిపాడులో పోస్టాఫీసు భవనం ప్రారంభం

చిలకలూరిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి సర్వేయర్ యద్దనపూడి ప్రసాద్ ప్రసాద్ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. చిలకలూరిపేట మండలం గొట్టిపాడులో ప్రభుత్వ భూమిలో రూ.9లక్షల సొంత నిధులతో సర్వేయర్ ప్రసాద్ నిర్మించిన పోస్టాఫీస్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నేత తోట రాజారమేష్, టీడీపీ నేత నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెరువురోడ్డులో 52ఎకరాలలో నిర్మించిన టిడ్కో గృహాల కాలనీలో లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 50కి పైగా అర్జీలు వచ్చాయి. కృష్ణారెడ్డి డొంక, రజక కాలనీలలోని ఆక్రమణలను మున్సిపల్ అధికారులు వెంటనే తొలగించాలని ప్రత్తిపాటి ఆదేశించారు. పసుమర్రులో 11.20 ఎకరాల చెరువును పట్టాభూమిగా మార్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, టీడీపీ మండల అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్ పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతోనే జగన్ బలప్రదర్శన

ప్రజాదర్బార్ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రత్తిపాటి ముందస్తు ప్రణాళికతోనే హైదరాబాదులో జగన్ బలప్రదర్శన చేశారన్నారు. కోర్టు వాయిదాలకు గైర్హాజరు కోసం వేసిన ఎత్తుగడ అన్నారు. సీబీఐ కోర్టుకు హాజరయ్యే క్రమంలో హంగామా సృష్టించడం ప్రజాస్వామ్య నిబంధనలకు పూర్తి విరుద్ధమన్నారు.

జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం

నాదెండ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆడ బిడ్డలకు రక్షణ, ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించేందుకు జెండర్ రిసోర్స్ కేంద్రం (ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రం) దోహదపడుతుందని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు అన్నారు. నాదెండ్లలో మెప్మా, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శుభోదయ మండల సమాఖ్య ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. నాదెండ్ల బరోడా బ్యాంక్ మంజూరు చేసిన రూ.89 లక్షల స్వయం సహాయక రుణాల చెక్కులను సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షుడు రజినికుమారి, సీడీపీవో శాంతకుమారి, యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, సొసైటీ అధ్యక్షుడు హరిబాబు, ఎంపీడీవో స్వరూపరాణి, తహసీల్దార్ కుటుంబరావు, నాయకులు పాల్గొన్నారు.

ఆలస్యంగా మండల పరిషత్ సమావేశం

రొంపిచర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీల కోరం లేక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా నాలుగు గంటల తరువాత ప్రారంభమైంది. 2025 - 26 సంవత్సరానికి సవరణ అంచనా బడ్జెట్ రూ.19.66 కోట్లు, వ్యయం 19.3 కోట్లు, మిగులు బడ్జెట్ రూ.36 లక్షలు అని ఎంపీడీవో తెలిపారు. 2026 - 27 సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూ 21.76 కోట్లు, వ్యయం రూ 21.50 కోట్లు కాగా మిగులు బడ్జెట్ రూ 26 లక్షలు అని తెలిపారు. సమావేశంలో విద్యుత్, ఐసీడీఎస్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు హాజరు కాలేదు.

మత్స్యకారులు సహకరించాలి

జిల్లా ఫిషరీస్ అధికారి ఎస్.సంజీవరావు

వినుకొండ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చేపల సంతాన ఉత్పత్తికి మత్స్యకారులు సహకరించాలని పల్నాడు జిల్లా ఫిషరీస్ అధికారి ఎస్.సంజీవరావు సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సంజీవరావు మాట్లాడుతూ చెరువుల్లో చేప పిల్లలను వదిలిన తరువాత నెల రెండు నెలల వ్యవధిలో చిన్నపిల్లలను పట్టుకోరాదని, పెద్ద చేపల కోసం వల వేసిన సమయంలో వలలో చిక్కుకున్న చిన్నచేపలను చెరువులో వదిలేయాని సూచించారు. కైకలూరులో తయారైన మూడు అంగుళాల చేపలను నాగార్జునసాగర్, పులిచింతల, బుగ్గవాగుల్లో వదలడానికి ఇప్పటికే ప్రణాళికలు తయారు చేశామన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు మోటారు సైకిళ్లు, ఐస్‌బాక్స్‌లు, ఫిషరీస్ రిటైల్ ఔట్‌లెట్స్, నాలుగు బండ్ల వాహనాలు, ఇన్సులేటెడ్ వాహనాలను 40, 60శాతం సబ్సిడీపై అందించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో 3600 ఆక్వా చెరువులకు ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం యూనిట్ ఒకటికి రూ.1.50పైసలకే విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. 50సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు వయోజన పింఛను అందజేస్తున్నామన్నారు. చేపల వేట సమయంలో మృతిచెందిన మత్స్యకారులకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేసియా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్.వెంకట్రావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టీవీఎస్ శ్రీనివాసరావు, వినుకొండ మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు సి.వెంకటేశ్వరరావు, కొప్పుకొండ మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు మూడావత్ రాంజీనాయక్, పేరూరుపాడు మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పి.రమణయ్య, నడిగడ్డ మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు డి.రాంబాబు, ఆక్వా రైతు డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి విరాళం

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట పట్టణంలోని కోటబజార్ పులుపులవారి వీధిలో ఉన్న వీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి శుక్రవారం దాతలు విరాళం అందజేశారు. కొత్తమాసు వేంకటప్పయ్య, ప్రేమలత దంపతులు రూ.2,01,116, మోదుగుల చంద్రం రూ.11,116లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వి.సాంబశివరావు, వి.కృష్ణ, కె.శివశ్రీనుబాబు, జి.మురళి, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీమా అందజేసేందుకు పంట కోత ప్రయోగాలు కీలకం: ఏవో

నూజెండ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంటలు నష్టపోయిన సందర్భంలో వారికి బీమా పైకం అందజేయటంలో పంట కోత ప్రయోగాలు కీలకమని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో శనివారం ప్రధానమంత్రి పంటల బీమా యోజన పంట కోత ప్రయోగాల నిర్వహణపై వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

రాయితీపై జర్నలిస్టులకు వైద్య సదుపాయం

● కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో అన్ని వైద్యశాలల్లో రాయితీపై జర్నలిస్టులకు వైద్య సదుపాయం కల్పిస్తామని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. నరసరావుపేట ఇండియన్‌మెడికల్ అసోషియేషన్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐఎంఏ భవనంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ కృతికాశుక్లా, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు జర్నలిస్టులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ నరసరావుపేటలో కల్పిస్తున్న రాయితీ సదుపాయాలను పల్నాడు జిల్లా వ్యాప్తంగా 7నియోజకవర్గాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టులు రాస్తున్న కథనాలతో లోటుపాట్లను సరిచేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. దినపత్రికల్లో వచ్చిన కథనాలను ప్రతిరోజు పరిశీలించి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. నిత్యం పనివత్తిడితో సతమతమవుతున్న జర్నలిస్టుల సంక్షేమానికి యూనియన్ ప్రత్యేక కృషి చేస్తుందని ఐవీ సుబ్బారావు తెలిపారు. నియోజకవర్గంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ నివేశన స్థలాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హామీ ఇచ్చారు.

టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజాదర్బార్

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు భారీ సంఖ్యలో అర్జీలను అందజేశారు. ఫిర్యాదులపై అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం

నరసరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిపాడు రోడ్డులో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం శుక్రవారం ఉదయం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నరసరావుపేట పట్టణంలోని రావిపాడు రోడ్డులోని కోమల కన్వెన్షన్ హాల్‌లో బరంపేట లీలా వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కేపీ రంగారావు, ప్రధాన అర్చకులు రత్నాకరం ప్రసాదుబాచి కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర విష్ణు సహస్రనామ సమాజం వారి 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో నరసరావుపేట పట్టణానికి చెందిన ఆర్.బ్రహ్మయ్య వెంకటలక్ష్మి దంపతులు, వి.శ్రీనివాసరావు పద్మావతి దంపతులు, పల్నాడు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సుస్మిత దంపతులు పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం 2000మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బరంపేట వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, ఎన్.సురేంద్ర చేగు వెంకటేశ్వరరావు, ఐ.సాంబశివరావు, ఎం.ప్రసాదరావు దంపతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

● ప్రజా దర్బార్‌లో చీఫ్ విప్ జీవీ



వినతిపత్రాలను స్వీకరిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజల కోసం చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చి వినతిపత్రాలు అందించారు. ప్రతి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కారమార్గం చూపుతామన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు

నాదెండ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులపై నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం గణపవరం గ్రామానికి చెందిన సంధ్యకు చిలకలూరిపేట పట్టణానికి చెందిన శ్రావణ కుమార్‌కు ఏడేళ్ళ క్రితం వివాహం జరిగింది. ఆ తరువాత భర్త శ్రావణ్ కుమార్ తనను అధిక కట్నం తెమ్మమని వేధింపులకు గురిచేస్తున్నారని చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

యడ్లపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నవ ఎస్టీ కాలనీలో బాలిక వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. వివాహం చేసేందుకు సిద్ధపడిన తల్లిదండ్రులకు అధికారులు కౌన్సెలింగ్ చేశారు. ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన 22 ఏళ్ళ యువకుడితో గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలికకు పెళ్లి చేస్తున్నారని చైల్డ్ ప్రొటెక్షన్ టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందిందన్నారు. సమాచారం అందిన వెంటనే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ, రెవెన్యూ, అంగన్‌వాడీ సిబ్బందితో కలసి బాలిక నివాసానికి వెళ్లి బాల్య వివాహం వలన కలిగే నష్టాలను వివరించడంతోపాటు వివాహం చేస్తే చట్టపరంగా తీసుకునే చర్యల గురించి వివరించి వివాహాన్ని నిలిపివేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి జయబాబు, గ్రామ మహిళా పోలీస్ రమ్య, అంగన్‌వాడీ కార్యకర్త ఎన్.సుష్మితలు ఉన్నారు.



శ్రీహరి కోట అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు

శ్రీహరికోటను సందర్శించిన కే-రిడ్జి విద్యార్థులు

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థులు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ నిర్వహిస్తున్న ఎస్‌డీఎస్‌సీ షార్ శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని సందర్శించారని ప్రిన్సిపాల్ జీ బర్నబాస్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు మొదట ఎస్‌డీఎస్‌సీ షార్‌లోని స్పేస్ మ్యూజియం సందర్శించి భారత అంతరిక్ష చరిత్ర, తొలి రాకెట్ ప్రయోగాలు, ముఖ్యమైన ఉపగ్రహ ప్రయోగాలు, పీఎస్ఎల్‌వీ-జీఎస్ఎల్‌వీ రాకెట్ నమూనాలను పరిశీలించారు. అనంతరం శాస్త్రవేత్తలు ఏర్పాటుచేసిన ప్రత్యేక ఇంటరాక్టివ్ కార్యక్రమంలో లాంచ్ వాహనాలను పరిశీలించారు. కార్యక్రమంలో అకడమిక్ ఆఫీసర్ విజయరాజు, కంప్యూటర్ సైన్స్ హెచ్‌డీవో విక్టర్, అన్నపూర్ణ, చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ఇన్‌చార్జి కోట బాపూజీ పాల్గొన్నారు.

సినీ దర్శకుడు సముద్రకు పితృవియోగం



వంకదారి రామలింగం (ఫైల్ ఫొటో)

యడ్లపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు వంకదారి సముద్ర తండ్రి రామలింగం (80) మృతిచెందారు. మండలంలోని బోయపాలెంకు చెందిన రామలింగం తొలి నుంచి టీడీపీ అభిమానిగా ఉంటూ క్రియాశీలకంగా వ్యవహరించారు. ఈయనకు బార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కాగా సినీ దర్శకుడు సముద్ర రెండో కుమారుడు. అంతేగాకుండా టీడీపీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబుకు తాత. బోయపాలెంలోని స్వగృహంలో గురువారం మృతిచెందాడు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రామలింగం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మాజీ ఎంపీపీ స్టీఫెన్ కరుణాకర్‌కు..

యడ్లపాడు మాజీ ఎంపీపీ పిల్లి స్టీఫెన్ కరుణాకర్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు దైవప్రసాదరావు (90) మృతిచెందారు. ఆయనకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. నాలుగేళ్ల క్రిందట భార్య దేవదయమ్మ మృతిచెందారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నెల్లూరి సదాశివరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు, నీటి సంఘం అధ్యక్షుడు పోపూరి రాఘవయ్య పలువురు టీడీపీ నాయకులు శుక్రవారం దైవప్రసాదరావు మృతదేహానికి నివాళులర్పించారు.